క్లుప్తంగా

మసీదులో ఎమ్మెల్యే ప్రార్థనలు



తెనాలి: పట్టణ చినరావూరు డొంక రోడ్డులోని మస్జీద్ ఇ రియాజుల్ జన్నలో మంగళవారం రాత్రి జరిగిన ప్రత్యేక దువాలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. అక్కడి ముస్లిం మత గురువు ఆశీర్వాదం తీసుకున్నారు. స్థానిక అంశాలపై మత పెద్దలతో మాట్లాడారు. ఆ ప్రాంత ప్రముఖులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



తెనాలిఅర్బన్: అమెరికాలో ఇటీవల మృతి చెందిన బుర్రిపాలెం వాసి పరుచూరి అభిజీత్ జ్ఞాపకార్థం శివాజీ చౌక్‌లోని శ్రీ కాళీమాత దేవస్థానం వద్ద బుధవారం పేదలకు అన్నదానం చేశారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గుమ్మడి రమేష్, దేవస్థాన కమిటీ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, కనకమేడల మురళీకృష్ణ, కందేపి సీతారామయ్య, అభిజీత్ తలిదండ్రులు శ్రీలక్ష్మి, చక్రధర్, మహిధర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ చెక్‌పోస్టులు తనిఖీ



తెనాలిరూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టులను డీఎస్పీ ఎం.రమేష్ బుధవారం తనిఖీ చేశారు. తెనాలి జేఎంజే కళాశాల వద్ద త్రీ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. అలానే రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో పెదరావూరు, నందివెలుగు, సంగాజాగర్లమూడి, బుర్రిపాలెం రోడ్డులో చెక్‌పోస్టలను ఏర్పాటు చేశారు. వీటిని డీఎస్పీ పరిశీలించారు. డీఎస్పీ వెంట త్రీ టౌన్ సీఐ ఎస్ రమేష్‌బాబు ఉన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు

తెనాలిరూరల్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు కేసు నమోదు చేశారు. దుగ్గిరాల మండలం ఈమని గ్రామంలో ఎస్ఈబీ తెనాలి ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. వ్యక్తి మద్యం విక్రయిస్తుండడాన్ని గుర్తించి పరిశీలించారు. అతని వద్ద 12 మద్యం బాటిళ్లు లభించడంతో వాటిని స్వాధీనపర్చుకుని కేసు నమోదు చేశారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

తెనాలిరూరల్: రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న వృద్ధురాలి మెడలో గొలుసును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ నాజరుపేటకు చెందిన 65 ఏళ్ల వృద్ధురాలు బుధవారం మధ్యాహ్నం దుకాణానికి వెళ్లి ఇంటికి తిరిగి వెళుతుండగా వెనుక నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలో గొలుసును అపహరించుకెళ్లారు. దీనిపై బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. మూడు సవర్ల గొలుసు అపహరణకు గురైందని బాధితురాలు చెబుతోంది.

ప్రచారాలకు అనుమతులు తప్పనిసరి

కొల్లిపర: గ్రామాల్లో అనుమతులు లేకుండా పార్టీ ప్రచారాలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామని ఎంపీడీవో, మండల ఎంసీసీ బి.వై. విష్ణుప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని పలు గ్రామాలలో ఉన్న ఫ్లెక్సీలను బుధవారం తొలగించడంతో పాటు జెండా దిమ్మెలపై గుర్తులు కనపడకుండా పార్టీ రంగులతో ఉన్న వాటిపై తెల్లరంగులు వేయించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మైకుల ద్వారా ప్రచారం నిర్వహిస్తే కచ్చితంగా అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను అతిక్రమిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.

27న హుండీ కానుకల లెక్కింపు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసియున్న మహంకాళీ అమ్మవారి దేవస్థానం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని ఈనెల 27వ తేదీ నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి చినవెంకటరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థానంలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు కార్యక్రమం 27వ తేదీ బుధవారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతుందని ఆసక్తిగల భక్తులు లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనవచ్చని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

ఇంటి వద్దకే వైద్యం.. నిరుపేద రోగులకు వరం

- వైద్య విధానంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం
- ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవల ద్వారా పేదల ఇళ్ల ముంగటకే వైద్య సేవలు
- మండలంలో ఇప్పటి వరకు 47,194 మందికి లబ్ధి
- ఆనందం వ్యక్తం చేస్తున్న బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు
- పేదల ప్రాణాలకు అండగా నిలుస్తున్న ఆరోగ్యశ్రీ సేవలు



అన్నవరం గ్రామంలో ఇంటికి వెళ్లి దీర్ఘకాలిక రోగికి వైద్యం అందిస్తున్న సిబ్బంది

కొల్లిపర: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోంది. పేదల అభ్యున్నతికి నూతనంగా ప్రవేశ పెట్టిన ఫ్యామిలీ డాక్టర్, కంటి వెలుగు, ఆరోగ్య శ్రీ., వైఎస్సార్ ఆసరా వంటి పథకాలు గ్రామాల్లోని పేద ప్రజలకు వరంలా మారాయి. గతంలో సామాన్యులకు ఏ చిన్న జబ్బు చేసినా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పట్టణాలకు పరుగులు తీసేవారు. అక్కడ ఉన్న ప్రభుత్వ వైద్యశాలలను గానీ, ప్రైవేటు వైద్యశాలలను గానీ ఆశ్రయించి జేబులు గుల్ల చేసుకునేవారు. కానీ నేడు పరిస్థితి పూర్తిగా మారింది. ఫ్యామిలీ డాక్టర్ పథకం అమల్లోకి వచ్చాక నెలకొక సారి వైద్య బృందం గ్రామాలకే వచ్చి రోగులకు పరీక్షలు చేసి వెంటనే వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేస్తున్నారు. నెలకు సరిపడా మందులు అందజేయటంతో పాటు తగు జాగ్రత్తలు చెబుతున్నారు. ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవల ద్వారా కొల్లిపర మండలంలోని 20 గ్రామాల్లో ఇప్పటి వరకూ 47,194 మందికి వైద్య సేవలు అందించారు. ప్రధానంగా బీపీ, షుగర్‌లతో బాధ పడుతున్న పేద రోగులకు నెలవారీ వైద్య పరీక్షలు, మందులు కొనుగోలు భారం తగ్గింది. ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు నిర్వహించే 104 వాహనంలోనే ప్రతి నెల వారికి గ్రామంలోని పరీక్షలు చేసి ఉచితంగా నెలకు సరిపడా మందులు ఇస్తున్నారు. పేద రోగులకు ఆరోగ్య భరోసా కల్పించటంతో ప్రభుత్వ సేవలపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గర్భిణీలకు వైఎస్సార్ ఆరోగ్య ఆసరా

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మెరుగు పరిచిన మరో పథకం వైఎస్సార్ ఆరోగ్య ఆసరా. గతంలో ప్రభుత్వాసుపత్రిలో పురుడు పోసుకున్న గర్భిణీకి ప్రోత్సాహకంగా కేవలం రూ.1300 ఇచ్చేవారు. ప్రస్తుత ప్రభుత్వం పురుడు పోసుకున్న మహిళకు రూ.5వేలు నగదు సాయం చేయడమే కాక తల్లీ బిడ్డలను ప్రభుత్వ వాహనంలోనే జాగ్రత్తగా ఇంటికి చేరుస్తున్నారు. ఇప్పటి వరకు ఈ పథకం ద్వారా మండలంలో 129 మంది మాతృమూర్తులకు సాయం అందింది.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న మరో ప్రతిష్టాత్మక పథకం కంటి వెలుగు ద్వారా గ్రామాలకు వచ్చి చిన్నారులకు, వృద్ధులకు ఉచితంగా నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్నారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందిస్తున్నారు. ఈ పథకం ద్వారా మండలంలో 3,725 మందికి పరీక్షలు నిర్వహించి వారిలో 848 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందించారు.

ప్రాణాలు నిలుపుతున్న ఆరోగ్యశ్రీ

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశ పెట్టిన ఆరోగ్య శ్రీ పథకాన్ని ఆయన తదనంతరం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు నిర్వీర్యం చేశాయి. ఈ పథకం ద్వారా కేవలం కొన్ని రకాల వ్యాధులకే నిధులు మంజూరు చేసేవి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం జగన్ ఈ పథకానికి ఊపిరి పోశారు. దాదాపుగా అన్ని రకాల వైద్య సేవలను ఈ పథకం కిందకు తీసుకువచ్చి నిరుపేదల ప్రాణాలు కాపాడుతున్నారు. ఈ నాలుగేళ్లలో కొల్లిపర మండలంలో సుమారుగా 1124 మంది ఈ పథకం ద్వారా ప్రాణాలతో బయటపడ్డారు.

వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు

మండలంలో ప్రభుత్వం నిర్మించిన హెల్త్ క్లినిక్‌ల ద్వారా వైద్యం పేద వారికి మరింత దరిచేరుతోంది. మండలంలో మొత్తం 12 హెల్త్ క్లినిక్‌లకు గానూ 4 నిర్మాణాలు పూర్తి చేసుకోగా మిగిలినవి నిర్మాణదశలో ఉన్నాయి. ఈ క్లినిక్‌లలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్, ఏఎన్ఎం, ఆశా కార్యకర్త ఉంటారు. వీరు ఆయా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గర్భిణీలు, బాలింతలకు వైద్య సేవలు అందిస్తారు.

ప్రతి నెల ఇంటి వద్దే వైద్య సేవలు



గత నాలుగేళ్ల నుంచి ప్రతి నెలా క్రమం తప్పకుండా వైద్య బృందం గ్రామాలకు వచ్చి మూత్ర, రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇస్తున్నారు. దీంతో వైద్యం కోసం టౌన్‌లో ప్రైవేటు ఆసుపత్రులకి వెళ్లే అవసరం లేకుండా పోయింది. ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలతో మా మందుల ఖర్చులు తగ్గటమే కాకుండా సకాలంలో వైద్య సేవలు అందుతున్నాయి.

– మారౌతు నాగేశ్వరరావు, దీర్ఘకాలిక రోగి, పిడపర్తిపాలెం

ఎన్నికల నియమావళిపై అవగాహన పెంచుకోండి

కొల్లిపర: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తరువాత ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు మాత్రమే కాకుండా సామాన్యులు సైతం కాస్త జాగ్రత్తలు పాటించాలని ఎంపీడీవో, మండల ఎంసీసీ అధికారి బి.వై. విష్ణుప్రసాద్‌లు సూచించారు. బుధవారం ఎన్నికల కోడ్‌పై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలక్షన్ కమిషన్ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ముఖ్యంగా ఎన్నికల కోడ్ వల్ల నగదు రవాణపై ఆంక్షలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. చెక్ పోస్టుల వద్ద తనిఖీలు చేసిన సమయంలో సామాన్యులు ఎవరైనా నగదును తరలిస్తున్నప్పుడు సరైన పత్రాలు లేకపోతే ఎవరి సొమ్మునైనా అధికారులు స్వాధీనం చేసుకుంటారన్నారు.

రూ.50 వేలకు మించితే వివరణ ఇవ్వాలి

రూ.50 వేల కన్నా ఎక్కువ నగదును సామాన్యులు తరలిస్తే పూర్తిగా వివరణ ఇవ్వాల్సి ఉంటుందని వివరించారు. ఆ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది? ఎలా వచ్చింది? ఎక్కడికి తీసుకొని వెళ్తున్నారు.. తదితర విషయాలు తనిఖీల్లో చెప్పాల్సి ఉంటుందన్నారు. వాటికి సంబంధించిన ధృవ పత్రాలు చూపించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నగదే కాకుండా బంగారం, వెండి తదితర ఆభరణాలు, విలువైన వస్తువులు ఏవైనా సరే అనుమానం వస్తే అధికారులు స్వాధీనం చేసుకుంటారన్నారు. అందువలన ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సామాజిక న్యాయం వైఎస్సార్ సీపీతోనే సాధ్యం

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- రానున్న ఎన్నికల్లో కాపులకు సముచిత స్థానం
- జనసేన పార్టీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన తాపీ వర్కర్స్ యూనియన్ నాయకులు



ఎమ్మెల్యే శివకుమార్‌ను సత్కరిస్తున్న తాపీ వర్కర్స్ యూనియన్ నాయకులు, సభ్యులు

తెనాలి: పేద, మధ్య తరగతి వర్గాలకు వైఎస్సార్ సీపీతోనే న్యాయం జరుగుతుందని ఆయా వర్గాల ప్రజలు విశ్వసిస్తున్నారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. కుల మతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూ వారికి చేదోడుగా నిలుస్తున్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. తాపీ వర్కర్స్ యూనియన్‌కు చెందిన నాయకులు, సభ్యులు జనసేన పార్టీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్, 15వ వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు నేతృత్వంలో కాపు సంఘ నాయకుడు, తాపీ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి దుడ్డెంపూడి నాగరాజు, అధ్యక్షుడు కేవై రాజు సహా యూనియన్ నాయకులు, సభ్యులు మొత్తం 70 మంది బుధవారం రాత్రి ఎమ్మెల్యే శివకుమార్ సమక్షంలో పార్టీలో చేరారు. స్థానిక గంగానమ్మపేట పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారికి పార్టీ కండువాలను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాలకు రాజ్యాధికారం కల్పించే దిశగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గొప్ప పరిపాలన చేస్తున్నారని అన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో కాపు సామాజిక వర్గానికి 30 అసెంబ్లీ సీట్లు, అయిదు ఎంపీ స్థానాలను కేటాయించటం గొప్ప విషయమన్నారు. ముఖ్యమంత్రి పాటిస్తున్న సామాజిక న్యాయాన్ని గుర్తించి వైఎస్సార్ సీపీలోకి చేరిన తాపీ వర్కర్స్ యూనియన్ నాయకులను అభినందించారు. తాపీ వర్కర్ల కష్ట సుఖాల్లో వెన్నంటి ఉంటూ అసోసియేషన్ ద్వారా అండగా నిలుస్తున్న దుడ్డెంపూడి నాగరాజు, కేవై రాజు, ఇతర సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు.అసోసియేషన్ అభివృద్ధికి తోడ్పాటు అందించడంతో పాటు తనను నమ్మి పార్టీలో చేరిన వారందరికీ భవిష్యత్‌లో అన్ని విధాలా సహకారం అందిస్తానని హామీ నిచ్చారు. ముఖ్యమంత్రిగా జగన్ మోహన్‌రెడ్డి, తెనాలి ఎమ్మెల్యేగా తాను రెండోసారి ఎన్నికయ్యేందుకు కృషి చేయాలని కోరారు. మాజీ వైస్ చైర్మన్ గుంటూరు కోటేశ్వరరావు, 12వ వార్డు కౌన్సిలరు కొర్ర యశోదలు పార్టీలో చేరిన నేతలకు శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీలో చేరిన వారిలో యర్రంశెట్టి సీతారామయ్య, వీరాంజనేయులు, మైలా నాగరాజు, మస్తాన్‌వలి, తోట నాగేశ్వరరావు, అనంతగిరి ఏడుకొండలు, యర్రంశెట్టి నాగరాజు, గురివిశెట్టి శ్రీను, చింతల గోపి, వెనిగళ్ల సుధాకర్, నాగిశెట్టి రామారావు తదితరులు న్నారు.

ఫైలేరియా క్లినిక్‌లను సద్వినియోగం చేసుకోండి

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ విజయలక్ష్మి



పాదరక్షలు పంపిణీ చేస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

తెనాలిఅర్బన్: తెనాలి కొత్తపేటలోని పాత ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో ఫైలేరియా క్లినిక్‌లను ఏర్పాటు చేయటం జరిగిందని దానిని అవసరమైన వారు ఉపయోగించు కోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి సూచించారు. ఫైలేరియా క్లినిక్‌ను బుధవారం ఆమె పరిశీలించారు. ఆ ప్రాంతంలో ఉన్న మలేరియా, ఫైలేరియా కార్యాలయాలను పరిశీలించి అక్కడ అందిస్తున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి బుధవారం ఇక్కడ ఫైలేరియా క్లినిక్‌ను నిర్వహించటం జరుగుతుందన్నారు. ఫైలేరియా రోగులకు ఉచితంగా మందులు సైతం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం మాట్లాడుతూ దోమ కాటు వల్ల మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, మెదడు వ్యాపు వంటి వ్యాధులు వస్తాయని చెప్పారు. ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బీబీ జాన్ మాట్లాడుతూ వైద్యశాలలో వివిధ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే మందులను కూడ ఉచితంగా ఇస్తున్నట్లు చెప్పారు. అనంతరం లెప్రా సొసైటీ వారి సహకారంతో రోగులకు పాదరక్షలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి చిరసాని ప్రభాకరరెడ్డి, సిబ్బంది జి రవికుమార్, శ్రీకంఠ ఉమాకాంత్, ఆరోగ్య విస్తరణాధికారి అందే బాలచంద్రమౌళి, శివగణేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ రాజ్యం

మండలంలో జోరుగా ఎన్నికల ప్రచారం

తెనాలిఅర్బన్: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుకు అంతా ఓట్లు వేయాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కోరారు. పట్టణంలోని ఏడో వార్డులో బుధవారం సాయంత్రం వారు పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిని తెలియజేసి ఓట్లు అభ్యర్థించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, కౌన్సిలర్ వీర్లపాటి విజయలక్ష్మి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అలమూరి విజయలక్ష్మి కుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు తాడిబోయిన రమేష్, కఠారి హరీష్, శానంపూడి రఘురామిరెడ్డి, పోతిరెడ్డి హేమలత తదితరులు పాల్గొన్నారు.

తూములూరు(కొల్లిపర): సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు వేసే రెండు ఓట్లతో జగనన్న నేతృత్వంలోని అద్భుత పాలన మళ్లీ ఆవిర్భవిస్తుందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తనయుడు అన్నాబత్తుని అఖిల్ గణేష్ అన్నారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని తూములూరు గ్రామంలో ఐదో రోజు దుగ్గిరాల మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామిరెడ్డి ఇంటి వద్ద నుంచి స్థానిక పార్టీ నాయకులతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి, తెనాలి శాసన సభ్యులుగా తన తండ్రి అన్నాబత్తుని శివకుమార్‌ను, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యను ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, సొసైటీ అధ్యక్షులు ఈమని హరికోటిరెడ్డి, పాలకేంద్రం అధ్యక్షులు ఉయ్యూరు ఉమామహేశ్వరరెడ్డి, ఈద హర్షవర్ధన్ రెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

సురక్ష మెడికల్ క్యాంప్‌లతో ఆరోగ్య భరోసా

డీఎంహెచ్‌వో విజయలక్ష్మి



మెడికల్ క్యాంప్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

తెనాలిఅర్బన్: జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌తో పేదలకు ఆరోగ్య భరోసా లభిస్తుందని జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి పేర్కొన్నారు. శాలిపేటలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్‌ను ఆమె పరిశీలించి అక్కడ అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్పెషలిస్ట్ వైద్యులు రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలు నివసించే ప్రాంతంలోనే వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో వీటిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆమె వెంట మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె హెలెన్ నిర్మల, డాక్టర్ వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దివి కిషోర్ కుమార్, డీపీఎంవో శ్యామ్ తదితరులున్నారు.

ఓటుతో దేశ భవిష్యత్తు నిర్దేశం



ప్రతిజ్ఞ చేస్తున్న కమిషనర్ శేషన్న, సీఐ దరశథ రామయ్య

తెనాలిఅర్బన్: దేశ భవిష్యత్‌ను మార్చేది ఓటు మాత్రమేనని దానిని అంతా ఉపయోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పిలుపునిచ్చారు. తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బుధవారం స్వీప్ (సిస్టమ్యాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) అవగాహన ర్యాలీని పట్టణంలో నిర్వహించారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలంటూ నినాదాలు చేశారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ శివాజీచౌక్ వరకు కొనసాగింది. శివాజీ చౌక్ వద్ద మానవ హారంగా ఏర్పడి ఓటును వినియోగించుకుంటామనే ప్రతిజ్ఞను చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఓటు పునాది అని తెలిపారు. దేశంలో నివసించే 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి రాజ్యాంగం ఓటు హక్కును కల్పించిందని చెప్పారు. అర్హులైన వారు తమ ఓటును నమోదు చేయించుకుని వినియోగించుకోవాలన్నారు. వన్‌టౌన్ సీఐ దశరథరామయ్య మాట్లాడుతూ ప్రజాస్వామ్య సంప్రదాయాలను పాటిస్తూ స్వేచ్ఛాయుత వాతావరణంలో అందరు ఓటు వేయాలన్నారు. ఎటువంటి ప్రలోభాలకు గురి కావద్దని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ అనూషా, ఏసీపీలు సుధాకర్, సుబ్బారావు, మెప్మా సీఎంఎం మాధవరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి

ఏపీ పసుపు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకరరావు



సమావేశంలో మాట్లాడుతున్న జొన్న శివశంకరరావు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల గ్రామం శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్‌లో జరిగిన అగ్నిప్రమాదం కారణంగా పంటను భద్రపరచుకుని నష్టపోయిన రైతులను న్యాయం చేయాలని ఏపీ పసుపురైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకరరావు డిమాండ్ చేశారు. బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేబీ భవన్‌లో ఏపీ పసుపు రైతుల సంఘం ఆధ్వర్యంలో దుగ్గిరాల కోల్డ్ స్టోరేజ్ అగ్నిప్రమాద బాధితుల సమస్యలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అగ్నిప్రమాద బాధితుల సంఘం కన్వీనర్ వేములపల్లి వెంకటరామయ్య అధ్యక్షత వహించారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య, న్యాయవాది కొండూరు వీరయ్య, రవికుమార్, రైతుసంఘం గుంటూరు జిల్లా సహాయ కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు

- నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా జేసీ రాజకుమారి
- పోలింగ్ కేంద్రాల పరిశీలన




తాడేపల్లిలో పోలింగ్‌బూత్‌ను పరిశీలించి అధికారులకు సూచనలు ఇస్తున్న జేసీ రాజకుమారి

మంగళగిరి: పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు ఇబ్బంది లేకుండా మౌలిక వసతులు కల్పించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని సీకే జూనియర్ కళాశాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రాజకుమారి విలేకరులతో మాట్లాడుతూ ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడడంతో పాటు వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు ఎవరైనా రూ.50వేలకు మించి నగదు వ్యక్తిగతంగా ఉన్నా, రూ.లక్షకు మించి బ్యాంక్‌లో జమచేసినా తగిన ఆధారాలు చూపాల్సి ఉంటుందన్నారు. ప్రజలంతా ఎన్నికల నిబంధనలను తెలుసుకుని అధికార యంత్రాంగానికి సహకరించి ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించాలన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో దుగ్గిరాల మండలంలో 55 పోలింగ్ కేంద్రాలను, తాడేపల్లిలో 46 పోలింగ్ కేంద్రాలను మంగళగిరిలోని కేంద్రాలను పరిశీలించి అధికారులకు అన్ని సూచనలు చేయడం జరిగిందన్నారు. తహసీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తాడేపల్లిలో...

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి బుధవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని పలు సెక్టార్లలో పోలింగ్ బూత్‌లను పరిశీలించి స్థానిక అధికారులకు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ తాడేపల్లి సెక్టార్-4 లో 10 పోలింగ్ కేంద్రాలను, మంగళగిరి సెక్టార్-16లోని 16 పోలింగ్ కేంద్రాలను, సెక్టార్-20లో 9 పోలింగ్ కేంద్రాలు మొత్తం 35 పోలింగ్ కేంద్రాలను సందర్శించిన అక్కడ అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర అంశాలపై స్థానికంగా ఉన్న అధికారులతో చర్చించామని, ఎన్నికల రోజు ఓటు హక్కు వినియోగించుకునే వారికి అంతరాయం కలగకుండా లైట్లు, ఫ్యాన్లు, టాయిలెట్లు, పోలింగ్ కేంద్రాల్లో ఫర్నిచర్, క్యూ లైన్లు ఏర్పాటు చేయడం వంటి సదుపాయాలను పరిశీలించి వాటిపై సూచనలు, సలహాలు అందజేశామని ఆమె తెలియజేశారు.

వ్యాక్సినేషన్ కేంద్రాల తనిఖీ



మంగళగిరి: పట్టణంలోని గణపతినగర్‌లోగల డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని జాతీయ వ్యాధి నిరోధక టీకాల కేంద్రాలను బుధవారం డిల్లీ నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్ ఇమ్యునైజేషన్ కన్సల్టెంట్ డాక్టర్ ఆయుషి తనిఖీ చేశారు. దేవస్థానం వద్దనున్న రెండవ వార్డు సచివాలయం, రాజా వాసిరెడ్డి వేంకటాద్రి నాయుడు కళావేదికలో కల చిన్న పిల్లల వ్యాధి నిరోధక టీకాల కేంద్రాలను తనిఖీ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. టీకాలు వేయించుకున్న పిల్లల జాబితాను పరిశీలించి పిల్లలందరికి టీకాలు వేయాలన్నారు. అనంతరం గణపతినగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను పరిశీలించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూష, సిబ్బంది పాల్గొన్నారు.